క్లుప్తంగా

భూమనకు రుణపడి ఉంటాం



అభినయ్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజేశ్వరి

తిరుపతి మంగళం : కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యులుగా, పార్టీ క్రిస్టియన్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పదవులు కల్పించిన భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వైఎస్సార్‌సీపీ నేత రాజేశ్వరి తెలిపారు. శనివారం ఈ మేరకు పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిని సత్కరించారు.

కందారపు రాజమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : సీపీఎం నేత కందారపు మురళి మాతృ మూర్తి కందారపు రాజమ్మ శుక్రవారం ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం తిరుపతి యశోదనగర్‌లోని మురళి ఇంటికి వెళ్లి రాజమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబికులను పరామర్శించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి రూరల్ : పెరుమాళ్లపల్లెలో రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్స్ హాస్పిటల్ వారు శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం, పింక్ బస్ సేవలకు విశేష స్పందన లభించింది. క్యాన్సర్ స్క్రీనింగ్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ ప్రాంభించారు. 74 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆధ్వర్యంలో 215 మందికి వైద్య పరీక్షలు చేసి చికిత్సలందించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్రమణ్యంరెడ్డి, రామమ్మూర్తి రెడ్డి, కుమారస్వామి రెడ్డి, వెంకటరామిరెడ్డి, తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

సుభాషిణి సేవలు మరువలేం



శుభగిరి నాయుడుతో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చెర్లోపల్లె సర్పంచ్ బొల్లినేని సుభాషిణి సేవలు ఎన్నటికీ మరువలేమని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం చెర్లోపల్లెలోని వారి నివాసానికి వెళ్లి సుభాషిణి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె భర్త శుభగిరి నాయుడును పరామర్శించారు. సుభాషిణి ఆకస్మిక మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్, పాకాల ఎంపీపీలు మూలం చంద్రమోహన్‌రెడ్డి, లోకనాథం, పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల పార్టీ అధ్యక్షులు నంగా నరేష్‌రెడ్డి, సింహాల మోహన్, చంద్రగిరి మండలం ఎంపీటీసీ సభ్యులు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, దెయ్యాల మావరెడ్డిలతో పాటు నేతలు దొరస్వామి, మునీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



మోహన్‌ను సన్మానిస్తున్న టీచర్లు

పాకాల : ఎస్‌వీఎస్ పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం రేణుక, ఎంఈఓ బాబ్జీ, ఎంఈఓ–2 లింగయ్య ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, టీచర్లు నజీమా, రామకృష్ణ, రాజేష్, ఈశ్వర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

వీజీఓలకు అభినందన



చైర్మన్‌తో వీజీఓలు

తిరుమల : అమెరికాలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన టీటీడీ వీజీఓలు సురేంద్ర, రామ్‌కుమార్ శనివారం తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా ప్రతిభ కనబరచిన అధికారులను చైర్మన్ అభినందించారు.



తొలగించనున్న శ్రీహరి బస్టాండ్ మొదటి భాగం



ప్రస్తుత కార్గో పాయింట్



ప్రస్తుత రిజర్వేషన్ కౌంటర్లు

శ్రీహరి.. కూల్చివేతే మరి!

శ్రీహరి బస్టాండ్ కూల్చివేతకు శ్రీకారం చుట్టనున్నారు. తొలి దశ పనులకు సంబంధించి వర్క్ ఆర్డర్‌ను సైతం రెండు రోజుల క్రితమే సిద్ధం చేశారు. ఈ మేరకు ఐదు ప్లాట్‌ఫామ్‌ల పరిధిలోని ఆరు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. వెంటనే షాపులు ఖాళీ చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. తర్వాత ఇదే స్థలంలో రేకులతో తాత్కాలిక షెడ్లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

- బస్టాండ్‌ను పడగొట్టేందుకు సన్నాహాలు
- ఖాళీ చేయాలని దుకాణాలకు నోటీసులు
- త్వరలోనే ప్రారంభంకానున్న పనులు
- తొలి దశను పూర్తి చేసేందుకు గడువు వంద రోజులు



తిరుపతి బస్టాండ్ ప్రధాన ద్వారం

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పరిధిలోని శ్రీహరి బస్టాండ్‌లో ఉన్న 19 ప్లాట్‌ఫామ్‌లను మూడు దశల్లో తొలగించనున్నారు. ఈ క్రమంలో తొలి దశ తొలగింపులకు రెండు రోజుల క్రితం వర్క్ ఆర్డర్ కేటాయించారు. ఈ మేరకు పనులు ప్రారంభించనున్నారు. దీంతో మొదటి ఐదు ప్లాట్‌ఫామ్‌ల పరిధిలోని 6 దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. వెంటనే షాపులు ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఏపీ రిజర్వేషన్ కౌంటర్‌తోపాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల రిజర్వేషన్ కౌంటర్లు కూల్చనున్నారు. ఈ కౌంటర్లను ఆర్టీసీ గ్యారేజ్ వరుసలో ఖాళీ దుకాణాల్లోకి మార్పు చేయనున్నారు. అలాగే అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయం సైతం తొలగించి, పడమటి వైపు ఆర్టీసీ సెక్యూరిటీ ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేయనున్నారు.

కష్టతరంగా కార్గో పాయింట్

ఆర్టీసీ కార్గో పాయింట్ ఏర్పాటు చేయడమే అధికారులకు కష్టతరంగా మారుతోంది. ఈ పాయింట్ ఏర్పాటు చేసేందుకు 4వేల చదరపు అడుగుల విస్తీర్ణం కావాల్సి ఉంటుంది. దీంతో తిరుమల బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఉన్న టీటీడీ రిజర్వేషన్ కౌంటర్‌ను గుర్తించారు. అయితే ఆ కౌంటర్ 3వేల చదరపు అడుగుల విస్తీర్ణం మాత్రమే ఉంది. దీంతో అందులో కేవలం కార్గో డెలివరీ కౌంటర్లు మాత్రమే ఏర్పాటు చేయనున్నారు. అలాగే డీపీటీఓ కాంప్లెక్స్‌లో వెయ్యి చదరపు అడుగుల స్థలంతో ఉన్న 3 దుకాణాలను కార్గో బుకింగ్ కోసం కేటాయించనున్నారు.

రూ.45లక్షలతో షెడ్లు

శ్రీహరి బస్టాండ్‌లోని చెన్నై(రెండు ప్లాట్‌ఫామ్‌లు), కాంచీపురం, పాండిచ్చేరి, పుత్తూరు ప్లాట్‌ఫామ్‌లను తొలగించనున్నారు. ఐదు ప్లాట్‌ఫామ్‌లను కూల్చివేసేందుకు రూ.14 లక్షలు కేటాయింపు చేశారు. తిరిగి అదే స్థలంలో రేకులతో షెడ్లు నిర్మించేందుకు రూ.45 లక్షలు ఖర్చు చేయనున్నారు. వంద రోజుల్లో పనులు పూర్తి చేయాల్సి ఉందని టార్గెట్ ఇచ్చినట్లు తెలుస్తుంది. రెండో దశలో 12వ ప్లాట్ ఫామ్ వరకు. మూడో దశలో 19వ ప్లాట్‌ఫామ్ వరకు తొలగించనున్నారు. అయితే నిత్యం సుమారు 1.50లక్షల మంది ప్రయాణికులు తిరుపతి బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

ఇబ్బంది లేకుండా తొలగింపు



తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నిత్యం ఎక్కువగా ఉంటుంది. అయితే వారికి ఇబ్బందులు లేకుండా తొలగింపులు చేపట్టడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఆ దిశగా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తారు. ప్రయాణికులకు సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– జగదీష్, డీపీటీఓ, తిరుపతి జిల్లా

ఆర్పీపై కేసు నమోదుకు డిమాండ్



ఆర్పీ లతను నిలదీస్తున్న డ్వాక్రా మహిళలు

తిరుపతి కల్చరల్ : నగరంలోని 3వ డివిజన్‌కు చెందిన 33 డ్వాక్రా సంఘాల మహిళల నగదు సుమారు రూ.కోటిని దుర్వినియోగం చేసిన రీసోర్స్‌పర్సన్ లతపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు తమిళ పాఠశాలలో నిర్వహించిన డ్వాక్రా సంఘాల సమావేశంలో ఆర్పీని బాధితులు నిలదీశారని వెల్లడించారు. లెక్కలను పరిశీలిస్తే ఆర్పీతోపాటు వెలుగు అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి 350 మంది డ్వాక్రా మహిళలకు నగదును రికవరీ చేయించాలని కోరారు. సీపీఐ నేత విశ్వనాథ్, ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ శివకుమార్ పాల్గొన్నారు.

‘రోజ్ ఘర్’లో దీపక్‌రాజా ఎంపిక



నియామక పత్రం అందుకుంటున్న దీపక్ రాజా

రొంపిచర్ల: పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల మండలం, నగిరికాడపల్లికి చెందిన వల్లిపాగు దీపక్ రాజా ప్రధానమంత్రి రోజ్ ఘర్ మేళాలో సెంట్రల్ మైనింగ్ విభాగంలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా దీపక్ రాజా నియామక పత్రాన్ని అందుకున్నారు.

బీసీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునస్వామి



మాట్లాడుతున్న సోమశేఖర్ ఆచారి

తిరుపతి కల్చరల్ : ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునస్వామిని నియమించినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు నియామకపత్రం అందజేశారు. మునస్వామి మాట్లాడుతూ జిల్లా కమిటీలో స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు మధు ఆచారి పాల్గొన్నారు.

15 నుంచి లక్ష్మీకుబేర యజ్ఞం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రామచంద్రాపురం : రామాపురం సమీపంలోని శ్రీబ్రహ్మ ఋషి ఆశ్రమ ఆవరణలో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు లక్ష్మీ కుబేర యజ్ఞం నిర్వహించనున్నారు. శనివారం ఈ మేరకు నిర్వాహకులు ఆశ్రమంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక వేత్త శ్రీరామనాథ మహారాజ్ స్వామి ఆధ్వర్యంలో యజ్ఞం జరిపించనున్నట్లు వెల్లడించారు. యజ్ఞంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

‘వసతి’.. పిల్లల దయనీయ స్థితి



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు, బీసీ నేతలు

చంద్రగిరి : స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. నిర్వహణ లోపం కారణంగా పురుగు పట్టిన స్నాక్స్ అందిస్తున్నారు. మరుగుదొడ్లు దారుణంగా తయారయ్యాయి. ఈ హాస్టల్‌లో పిల్లలు పడుతున్న అవస్థలు తెలుసుకున్న బీసీ సంఘం నేతలు శనివారం అక్కడకు వెళ్లి విద్యార్థులతో కలిసి నిరసనకు దిగారు. అధికారులు నిర్లక్ష్యంపై మండిపడ్డారు. విద్యార్థినులు మాట్లాడుతూ ఒక లీటరు పాలలో నీళ్లు పోసి సుమారు 60 మందికి అందిస్తున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, తాగునీరు సైతం కలుషితంగా మారిందని వెల్లడించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోందన్నారు. నేతలు మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులతో పనులు చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాజమ్మకు అంతిమ వీడ్కోలు



రాజమ్మ అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్ : సీపీఎం నేత కందారపు మురళి మాతృమూర్తి కందారపు రాజమ్మకు శనివారం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, వాడ గంగరాజు , సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, సీపీఐ(ఎంఎల్) జిల్లా నేత హరికృష్ణ, ఆర్‌పీఐ నేత అంజయ్య పాల్గొన్నారు.

శ్రీవారికి నూతన పరదాలు



పరదాలను రూపొందిస్తున్న మణి

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆణివార ఆస్థానం సందర్భంగా మంగళవారం తిరుమల ఆలయంలో నిర్వహించనున్న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రోజున సమర్పించేందుకు నూతన పరదాలు, కురాళాలు తిరుపతికి చెందిన పరదాల మణి ఆకర్షణీయంగా రూపొందించారు. ఆయన సుమారు 27 ఏళ్లుగా ప్రతి సంవత్సరం నాలుగు పర్యాయాలు పరదాలు, కురాళాలను సమర్పిస్తున్నారు. ఈమేరకు సోమవారం కాలినడకన తిరుమలకు వెళ్లి వరాహ స్వామి దర్శనానంతరం పరదాలను అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న తిరుపతి రూరల్ మండలం నేతలు



మోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నరేష్‌బాబు



మోహిత్‌రెడ్డితో యోగానందరెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తామని పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన చంద్రగిరి నియోజకవర్గం నేతలు స్పష్టం చేశారు. శనివారం వేర్వేరుగా ఈ మేరకు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమను పదవులకు సిఫార్సు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షంలో బాగా పనిచేసినప్పుడే నాయకత్వ లక్షణాలు బయటపడతాయని, భవిష్యత్‌లో రాజకీయంగా ఎదగడానికి అవకాశం కలుగుతుందన్నారు. జగనన్న సైనికులుగా పనిచేసే అవకాశం వచ్చినందుకు గర్వించాలని సూచించారు.

అమ్మ దర్శనానికి అవస్థలు

తిరుమల శ్రీవారి తల్లి వకుళాదేవిని దర్శించుకునేందుకు నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పేరూరు బండపై కొలువైన అమ్మవారిని సేవించుకునేందుకు పోటెత్తుతున్నారు. పర్యాటకశాఖ బస్సులు సైతం తమ టూర్ ప్యాకేజీలో భాగంగా విశిష్ట గుడి వద్దకే భక్తులను చేరుస్తుండడంతో తాకిడి పెరుగుతోంది. అయితే మౌలిక వసతుల కల్పనలో మాత్రం టీటీడీ శీతకన్ను వేసింది.



వకుళమాత కొండ నుంచి వస్తున్న భక్తులు (ఫైల్)



దర్శనం లేకపోవడంతో నిరాశ

తిరుపతి రూరల్ : మండలంలోని పాతకాల్వ సమీపంలో పేరూరు బండపై వెలసిన వకుళమాత ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రధానంగా ప్రతి శుక్రవారం గుడి పరిసరాలు భక్తులతో నిండిపోతున్నాయి. అయితే ఆలయ అధికారులు భక్తులతో వ్యవహరించే తీరు సరిగాలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్శనం తరువాత తీర్థం ఇవ్వడం, శఠారి పెట్టడం వంటి ఆచారాలకు మంగళం పాడేస్తుండడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆలయం దర్శనవేళలను పాటించడంలో ఆలయ అధికారుల వైఖరిపై భక్తులు మండిపడుతున్నారు.

దివ్యాంగులు.. వృద్ధులకు ఇక్కట్లు

శ్రీవకుళమాత దర్శనార్థం వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులు కొండపైకి చేరలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, దివ్యాంగులను కొండపైకి తరలించేందుకు వాహనాలను టీటీడీ సమకూర్చకపోవడంపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తలుపులు మూసివేత

అమ్మవారి దర్శన వేళలు ప్రతి రోజు ఉదయం 4.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి సాయంత్రం 4.30 నుంచి 8.30గంటల వరకుగా టీటీడీ అధికారులు నిర్ణయించారు. అయితే కొండ కింద నుంచి భక్తులు వస్తున్నప్పటికీ ఆలయ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా తలుపులు మూసేస్తున్నారు. కొండ కిందే గేట్లు వేసేసి పైకి భక్తులను అనుమతించకపోతే ప్రయాస తప్పుతుందని కదా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కఠినంగా వ్యవహరించడం వల్లే అపవాదులు వస్తున్నాయని సమాచారం. టీటీడీ స్పందించి భక్తులందరికీ అమ్మవారి దర్శనభాగ్యం కల్పించాలని స్థానికులు సూచిస్తున్నారు.

నోటీస్ బోర్డు

- అలిపిరి వద్ద ఉదయం 7 గంటలకు గరుడ గమనం తిరుమల సప్తగిరి పరిణామ యాత్ర ప్రారంభం.
- మహతి కళాక్షేత్రంలో ఉదయం 10.20 నుంచి 11.55 గంటల వరకు శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణమహోత్సవం.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 9.30 నుంచి రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ దశమ వార్షికోత్సవ వేడుకలు.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తైక్వాండో చాంపియన్ షిప్.
- తిరుచానూరులోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు శ్రీపద్మావతి శ్రీనివాసుల కల్యాణ మహోత్సవం.
- బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో ఉదయం 11 నుంచి రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ చాంపియన్ షిప్.
- మహతి కళాక్షేత్రం నుంచి సాయంత్రం 4.30 గంటలకు పురవీధుల్లో శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుమాడ వీధుల్లో దేవదేవేరుల ఊరేగింపు.

చెవిరెడ్డి కోసం ప్రత్యేక పూజలు



పెంచలకోన ఆలయం వద్ద నేతలు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వెంటనే బెయిల్ రావాలని కోరుతూ పెంచలకోన లక్ష్మీనృసింహస్వామికి శనివారం పాకాల మండలం నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మోహిత్‌రెడ్డి పేరిట అర్చన చేయించి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో నేతలు హరి ప్రసాద్ రెడ్డి, భాస్కర్ నాయుడు, రహీంబాయ్, గొడుగుచింత వినాయక, బి.రవి రాయల్, భానుమహేష్, పవన్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి



ఆలయం వెలుపల మంత్రి కొల్లు రవీంద్ర

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంత్రి కొల్లు రవీంద్ర శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఎస్‌ఓ రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

గేజ్ రైల్వే ట్రాక్ పనులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని రైల్వే గేటు వద్ద గేజ్ రైల్వే ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం రైల్వే గేటును మూసి వేశారు. ఈ పనుల పూర్తి సుమారు 3 రోజులవుతుందని రైల్వే సిబ్బంది తెలిపారు. దీంతో పాకాల మీదుగా తిరుపతికి వెళ్లే వాహనాలు అన్ని పాలినేనివారిపల్లె సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా ప్రయాణిస్తున్నాయి.

తిరుమలలో టీటీడీ ఈఓ తనిఖీలు

తిరుమల : తిరుమలలోని పలు ప్రాంతాలను టీటీడీ ఈఓ శ్యామలరావు శనివారం తనిఖీ చేశారు. సీఆర్‌ఓ కార్యాలయ ఆధునికీకరణ ప్రణాళికలను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం–5ను సందర్శించారు. టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఓలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

తిరుపతిలో ఎస్పీ..



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైం: నగరంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. భక్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్లతో మాట్లాడి డిజిటల్ మీటర్లపై ఆరా తీశారు .